ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్య

- అదే సీఎం జగన్ సర్కారు లక్ష్యం
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- ప్రేమ సమాజం పాఠశాలలో ట్యాబ్‌ల పంపిణీ

దాబాగార్డెన్స్: ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం వైఎస్ జగన్ సర్కార్ కార్పొరేట్ విద్య అందిస్తుందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. దాబాగార్డెన్స్‌లోని ప్రేమ సమాజం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బై జూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో 4,59,564 మంది విద్యార్థులకు, 59,176 మంది ఉపాధ్యాయులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు ఉచితంగా పంపిణీ చేయడం ప్రశంసనీయమన్నారు. కార్పొరేటర్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. జిల్లా వ్యాప్తంగా 12 వేల ట్యాబ్‌లు అందిస్తుండగా.. దక్షిణ నియోజకవర్గంలో 3,900 ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. ప్రేమ సమాజం అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఇంతటి చక్కని ట్యాబ్‌ను ఉచితంగా అందించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పాఠశాలతో పాటు ప్రతి విద్యార్థి తరఫున కృతజ్ఞతలు తెలిపారు. 44 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బిపిన్ కుమార్ జైన్, ఇన్‌చార్జ్ కరస్పాండెంట్ ఎ.నాగేశ్వరరావు, స్కూల్ కమిటీ సభ్యులు ఉప్పల భాస్కరరావు, భగవత్ పరమేశ్వర్, కార్యదర్శి కోన జగదీశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ఎస్.అప్పలరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.రామలక్ష్మి, వార్డు నాయకులు దొడ్డి బాపూ ఆనంద్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఎంజీఎం హైస్కూల్లో..

అల్లిపురం: ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు చదువుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆకాంక్షించారు. అల్లిపురం జీవీఎంసీ మహాత్మాగాంధీ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీఎస్ఎస్ నాగభూషణం ఆధ్వర్యంలో నవరత్నాల్లో భాగంగా మంగళవారం 8వ తరగతి విద్యార్థులకు బైజ్యూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. లక్ష విలువైన ట్యాబ్‌ను ముఖ్యమంత్రి మీకు అందించడం ముదావహమన్నారు. 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ మాట్లాడుతూ విద్యారంగంలో ఇది గొప్ప విప్లవాత్మకమైన చర్య అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ట్యాబ్ వినియోగం.. ఉపయోగాల గురించి వివరించారు. ట్యాబ్‌లను కేవలం చదువుకోవడానికే ఉపయోగించాలని, దుర్వినియోగం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, నగర కార్యదర్శి, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, వార్డు మహిళా అధ్యక్షురాలు వై.చిన్నమ్మలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, గోపి తదితరులు

సావిత్రిబాయిపూలేకు నివాళులు..

సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా ముందుగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం, 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపి తదితరులు పాల్గొని సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

'దేవాంగ' క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దర్శకుడు నక్కిన త్రినాథరావు తదితరులు

దాబాగార్డెన్స్: 'దేవాంగ' మాసపత్రిక 2023 క్యాలెండర్‌ను సినిమా డైరెక్టర్ నక్కిన త్రినాథరావు మంగళవారం ఆవిష్కరించారు. 'ధమాకా' సినిమా ప్రచారంలో భాగంగా విశాఖ విచ్చేసిన ఆయన్ను దేవాంగ ఎడిటర్ ఉప్పుగంటి సదాశివరావు కలిసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాంగ యువత మరింత ఉత్సాహంతో పనిచేసి దేవాంగ సమైక్యతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పత్రిక పబ్లిషర్ ఉప్పుగంటి కిరణ్ కుమార్, నక్కిన సురేష్, అంకం దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు యోగా సెంటర్ ప్రారంభం

మురళీనగర్: మురళీనగర్ తెన్నేటిపార్కు, బ్యాంక్ ఆఫ్ ఇండియా పక్కన క్షీరాబ్ధి లేడీస్ హాస్టల్ ప్రాంగణంలో యోగా కేంద్రాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు భారతీయ జనతాపార్టీ వైద్య విభాగం కన్వీనరు రూపాకుల రవికుమార్ తెలిపారు.ఈ కేంద్రాన్ని ఉదయం 10.30 గంటలకు మిజోరం రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు ప్రారంభిస్తారని రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు, 50వార్డు కార్పొరేటరు వి.ప్రసాద్ పాల్గొంటారని చెప్పారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వి.రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

5న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈనెల 5న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

పింఛన్ పునరుద్ధరణ


గంధవరపు శ్రీను నుంచి వేలిముద్రలు తీసుకుంటున్న వెల్ఫేర్ సెక్రటరీ తదితరులు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట దరి సింహాలదేవిడికి చెందిన మానసిక వికలాంగుడు గంధవరపు శ్రీను పింఛన్ కొంత కాలం క్రితం రద్దయింది. అదే పింఛన్ మళ్లీ ఇప్పుడు పునరుద్ధరించబడింది. ఈ మేరకు సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ కృష్ణకుమారి, వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి పాల శ్రీహరిరెడ్డి, 33వ వార్డు మహిళా అధ్యక్షురాలు వై.చిన్నమ్మలు, పార్టీ నాయకుడు నీలాపు అయ్యప్పరెడ్డి మంగళవారం అతని నుంచి వేలిముద్రలు సేకరించారు. అతనికి నూతన పింఛన్ అందజేయనున్నట్లు వారు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

జగదాంబ: విల్లూరి ఫుడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం -2023 క్యాలెండర్‌ను మంగళవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, మాసిపోగు రాజు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

సీపీ కార్యాలయంలో..


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ శ్రీకాంత్ తదితరులు

అల్లిపురం: ట్రాఫిక్ అవగాహన చేపడుతూ ఓలీవ్ సతీష్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 క్యాలెండర్‌ను నగర పోలీస్ కమిషనర్ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ అవగాహనతో క్యాలెండర్ రూపొందించిన తీరును, పలు ట్రాఫిక్ స్లోగన్స్‌ను కార్టూన్‌తో చెప్పిన తీరును ప్రశంసించారు. కార్యక్రమంలో ఓలీవ్ సతీష్‌తో పాటు ఎస్‌బీ ఏడీసీపీ గంగాధర్, ఎస్‌బీ-2 సీఐసీసీఆర్‌బీ సీఐ, హార్బర్ సీఐ, అడ్మిన్ ఆర్ఐ పాల్గొన్నారు.

37వ వార్డులో అభివృద్ధి పనులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 37వ వార్డులో వార్డు అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ మంగళవారం శ్రీకారం చుట్టారు. జబ్బర్‌తోట పరిసర ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జానకీరామ్ మాట్లాడుతూ వార్డు పరిధి అన్ని ప్రాంతాల్లో నూతన రహదారుల నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆకుల యేసు, డేవిడ్‌రాజు, సీహెచ్ వెంకటలక్ష్మి, కాసరపు వాసు, సారిక దైవకుమార్, ఆనంద్, డాక్టర్ రమణ, శేఖర్, నెల్లి వంశీ, రామచంద్ర, సచివాయ కన్వీనర్లు రోజా, రమణి, ఆదిలక్ష్మి, శైలజ, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.


జబ్బర్‌తోటలో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన కార్పొరేటర్ చెన్నా

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన

అల్లిపురం: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. ప్రజా దర్బార్‌లో వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. పలువురికి తక్షణ సాయంగా నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ అసోసియేషన్ సభ్యులు బర్రి కొండబాబు, వాసుపల్లి ప్రసాద్, పీసీ అప్పారావు, మున్నాం బాలాజీ, కింగ్ ఫిషర్ రాజు, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ 38వ వార్డు అధ్యక్షుడు సంకాభక్తుల సన్యాసిరావు, స్టేట్ డైరెక్టర్ సనపల రవీంద్ర, డేవిడ్ రాజు, కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సభ్యుడు బెహరా వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

35వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జగదాంబ: సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. మంగళవారం జీవీఎంసీ 35వ వార్డులో రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం విల్లూరి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కట్టుబడి ఉన్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి వార్డు సచివాలయనికి రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం కేటాయించిందన్నారు. సీసీ రోడ్లు, కాలువలు, తాగునీరు, తదితర కనీస సౌకర్యాలు ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. మిగతా వీధుల్లో ఆయా సచివాలయలకు కేటాయించిన నిధులతో ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ తేజశ్విని, వార్డు నాయకులు గౌరీశంకర్, మంగరాజు, తదితరులు పాల్గొన్నారు.


తారురోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

నిషేధం ప్రజాస్వామ్య విరుద్ధం

అల్లిపురం: భద్రత పేరుతో.. ప్రమాదాలు జరుగుతున్నాయన్న సాకుతో ఆంధ్రప్రదేశ్‌లో 30 పోలీస్ యాక్టు పెట్టి బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధించడం తగదని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తున్న ప్రతిపక్ష పార్టీలను అణగదొక్కడం సరికాదని ఆయన అన్నారు.

సమాచారమ్

అల్లూరి స్టడీ సర్కిల్‌లో గ్రూప్-2 శిక్షణ

దాబాగార్డెన్స్: అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్-2 అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్టు కేంద్రం కార్యదర్శి బి.గంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా http://shorturl.at/mvyF3 లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 16వ తేదీ ఆఖరని, ఈ నెల 20 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. పూర్తి వివరాలకు 80084 12798 ఫోన్ నంబరులో గానీ, లేదా దాబాగార్డెన్స్, లలితానగర్(బాటా షోరూమ్ ఎదురుగా రోడ్డు)లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంప్రదించవచ్చునని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

అల్లిపురం : విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం టూటౌన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం బీహార్‌కు చెందిన ప్రమోద్‌కుమార్ శర్మ, అలస్వర్‌కుమార్, దీపక్‌కుమార్, హరి కిషోర్ శర్మ ప్రతి ఏడాది మాదిరిగానే ఈఏడాది డిసెంబర్‌లో నగరానికి బట్టల వ్యాపారం నిమిత్తం వలస వచ్చారు. వారు మనోరమా థియేటర్ వద్ద గది అద్దెకు తీసుకుని ఉంటున్నారు. మంగళవారం సాయంత్రం ప్రమోద్‌కుమార్ శర్మ, మరో యువకుడు ఇంటి వద్ద ఉండి బట్టలు ఉతుక్కుంటున్నారు. ఆ సమయంలో నీళ్లు అయిపోవటంతో ప్రమోద్‌కుమార్ శర్మ మోటారు వేసేందుకు మోటారు వద్దకు వెళ్లాడు. మోటార్ ప్లగ్ మార్చే సమయంలో విద్యుదాఘాతానికి గురై పడిపోవడంతో అతన్ని స్థానికుల సహకారంతో కేజీహెచ్‌కు తరలించారు. అప్పటికే అతను చనిపోయాడని వైద్యులు నిర్ధారించడంతో టూటౌన్ పోలీసులు మృతుని సోదరుడు సుమిత్‌కుమార్‌శర్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ద్విచక్ర వాహనాల బహిరంగ వేలం

మద్దిపాలెం : విశాఖ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్-4లో పలు ద్విచక్ర వాహనాలకు బుధవారం బహిరంగ వేలం వేయనున్నట్టు సెబ్ సీఐ సీహెచ్‌వీఎస్ ప్రసాద్ తెలిపారు. ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ ఈ వాహనాలకు ఉదయం 11.30 గంటలకు మురళీనగర్ లో ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్న సెబ్ స్టేషన్‌లో వేలం ప్రారంభమవుతుందని అన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకుందాం

సీతమ్మధార : సేవలతో ఆదుకుంటున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం కాకుండా రక్షించుకోవాలని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి బోగవెల్లి నాగభూషణం పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన నిరాహార దీక్షలు 642వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన కరోనా కష్టకాలంలో విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు తమ వంతు పాత్ర పోషించి ప్రజలకు భరోసాగా నిలిచాయన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు అమ్మేయాలని చూడడం అవివేకమన్నారు. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ కార్యనిర్వాహాక అధ్యక్షుడు ఎస్.తాతబాబు, ఉపాధ్యక్షుడు పీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న ఆందోళనకారులు

దివంగత నటీమణి భానుమతి సేవలు ఆదర్శప్రాయం

అల్లిపురం: చిత్ర రంగానికి డాక్టర్ భానుమతి రామకృష్ణ చేసిన సేవల్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య జీఎస్ఎన్ రాజు అన్నారు. ప్రఖ్యాత గాయని, నటి డాక్టర్. పి.భానుమతి వర్ధంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో భానుమతి పాట.. సీవీ రాజేశ్వరి నోట అనే శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ భానుమతి గాయనిగా, నటిగా, స్టూడియో అధినేత్రిగా, రచయిత్రిగా, సంగీత దర్శకురాలిగా చిరస్మరణీయమైన సేవలు అందించారన్నారు. భానుమతి స్మారకార్థం సీవీ రాజేశ్వరి ఇటువంటి పాట కచేరీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. కృష్ణమోహన్ మాట్లాడుతూ వృత్తి ఏయూ, ప్రవృత్తి గానంగా చేసుకుని ప్రత్యేక గుర్తింపు పొందిన రాజేశ్వరి గానం ప్రశంసనీయమన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి మాట్లాడుతూ భానుమతి చిత్ర గీతాలు అన్ని వర్గాల ప్రజల హృదయాల్లో నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో గాయనీ గాయకులు పాడిన ఆకాశవీధిలో హాయిగా, నీటిలోన నింగిలోన, జాబిలి ఓ జాబిలితో పాటు ఓహో ఓహో పావురమా, కన్నులే నీకోసం వంటి పాటలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి చెన్నా తిరుమలరావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సన్‌మూర్తి, కొణతాల రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీవీ రాజేశ్వరిని ముఖ్య అతిథులు సత్కరించారు.


సీవీ రాజేశ్వరిని సత్కరిస్తున్న సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ జీఎస్ఎన్ రాజు, వీవీ రమణమూర్తి

'మణిదీపాలు' కవితా సంపుటి ఆవిష్కరణ

సీతంపేట: రచయిత్రి సాలిపల్లి మంగామణి రచించిన 'మణి దీపాలు' కవితా సంపుటి ఆవిష్కరణ సభ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు ముఖ్య అతిథిగా హాజరై కవితా సంపుటిని ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత డి.వి.సూర్యారావు పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో కళావేదిక వ్యవస్థాపకులు నందూరి రామకృష్ణ, విశ్రాంత ఆచార్యులు సజ్జా మోహన్‌రావు, సాహితీవేత్తలు నవ సాహిత్య ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు ఎస్.వి.సూర్యప్రకాశరావు, ఆర్ అండ్ బి డీఈ ఆర్.ఆర్. విద్యాసాగర్, తెలుగు ఉపన్యాసకులు బి.రజిని పాల్గొన్నారు.


కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కూటికుప్పలసూర్యారావు తదితరులు

నగర పోలీస్ జట్టుకు సీపీ అభినందనలు


పోలీస్ క్రికెట్ జట్టు సభ్యులను అభినందిస్తున్న సీపీ సీహెచ్.శ్రీకాంత్ తదితరులు

అల్లిపురం: జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సంస్థాగత క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌లో 2022 సంవత్సరానికి నగర పోలీస్ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ జట్టు సభ్యులను కార్యాలయానికి మంగళవారం పిలిపించి అభినందనలు తెలియజేశారు. ఉత్తమ బ్యాట్స్‌మన్‌గా ఎంపికైన పోలీస్ టీం కెప్టెన్ వి.త్రినాథ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నగర క్రికెట్ పోలీస్ టీం ఇన్‌చార్జి ఇమ్మాన్యేల్ రాజు, ఇన్‌స్పెక్టర్(ఆరిలోవ), ఎస్ఐ శ్రీకాంత్ (స్టీల్‌ప్లాంట్) పాల్గొన్నారు.

మురుగు సమస్యకు చెక్

- ఊపిరి పీల్చుకున్న పూర్ణామార్కెట్ చుట్టుపక్కల స్థానికులు
- చొరవ చూపిన కార్పొరేటర్ విల్లూరికి అభినందనలు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో ఎట్టకేలకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య శాశ్వతంగా పరిష్కారం అయింది. పూర్ణామార్కెట్ లోతట్టు ప్రాంతం కావడంతో మురుగు నీరంతా ఇక్కడి నుంచి వెళ్తున్న అండర్ గ్రౌండ్ యూజీడీ నుంచి ప్రవహిస్తూ ఉంటుంది. ఇందులో కేజీహెచ్ నుంచి ప్రత్యేక లైను కలిపి ఉండడంతో అక్కడ వాడి పడేసిన ప్లాస్టిక్ బాటిళ్లతో పాటు బెడ్‌షీట్లు, తలగడలు, సూదులు, సిరంజిల వంటి వ్యర్థాలు కూడా వస్తుండేవి. అవి ఎక్కువ మొత్తంలో రావడంతో యూజీడీల వద్ద అడ్డుపడి మురుగు అంతా రహదారులపైనే ప్రవహిస్తుండేది. అంతే కాకుండా తారకరామనగర్‌లోని మురుగు నీరు తోడే ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద ఉన్న 20, 50 హెచ్‌పీ మోటార్ల సామర్థ్యం చాలక రహదారుల మధ్య ఉండే యూజీడీలు మరింత పొంగి అపరిశుభ్రంగా మారి.. దుర్గంధం వెదజల్లేవి. ఎక్కువగా పూర్ణామార్కెట్, స్ప్రింగ్‌రోడ్డు, పూర్ణామార్కెట్ ప్రధాన రహదారి, నూనెమిల్లువీధి, పండావీధి, ప్రసాద్‌గార్డెన్స్, బౌడారారోడ్డు, రామకృష్ణ జంక్షన్ , డాల్ఫిన్ హోటల్ ప్రాంతం, 75 ఫీట్ రోడ్డు, మజీద్ వద్ద ఉండే యూజీడీలు నానా ఇబ్బందులకు గురిచేసేవి.


పూర్ణామార్కెట్ వద్ద మురుగు నీటిలో నడిచి వెళ్తున్న ప్రజలు


ప్రారంభమైన 120 హెచ్‌పీ మోటార్లు

కార్పొరేటర్ చొరవతో...

వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు చొరవ తీసుకుని యూజీడీ సమస్య పూర్తిగా పరిష్కరించాలని జీవీఎంసీ ఉన్నతాధికారులకు సమస్యను వివరించి నివేదికలు ఇచ్చారు. దీంతో జీవీఎంసీ ఉన్నతాధికారులు ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద అయిదు 120 హెచ్‌పీ మోటర్లు ఏర్పాటు చేయడమే కాకుండా, వార్డులోని యూజీడీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీల లోతును పది నుంచి 16 అడుగులకు పెంచి నీటిప్రవాహానికి అడ్డు లేకుండా శాశ్వత పరిష్కారం చేపట్టారు. దీంతో పూర్ణామార్కెట్ వ్యాపారులు, స్థానికులకు ఉపశమనం కలిగింది.

ప్రజాసమస్యల పరిష్కారంలో వైసీపీ ముందుంటుంది



ప్రజా సమస్యల పరిష్కారంలో వైసీపీ ప్రభుత్వం ముందుంటుంది. పూర్ణామార్కెట్ తదితర ప్రాంతాల్లో పొంగి ప్రవహిస్తున్న యూజీడీలతో ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. వారు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులతో చర్చించి మోటార్ల స్థాయి పెంచి పూర్తిగా సమస్యను పరిష్కరించాం.

– విల్లూరి భాస్కరరావు, 35వ వార్డు కార్పొరేటర్